పొంచి ఉన్న ప్రమాదాలు

తస్మాత్ జాగ్రత్త..
- ఆద మరిస్తే.. అంతే సంగతులు
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

ఇల్లెందు: పట్టణంలో పలు చోట్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆద మరిస్తే అంతే సంగతులు. తక్షణం అధికారులు జోక్యం చేసుకోకుంటే ఎప్పుడైనా అనుకోకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పట్టణంలోని జేకే బస్టాఫ్ ఎదురుగా ముత్యాలమ్మ గుడి పక్కన ఓ బోర్డు ఉంది. ఆదివారం రాత్రి అటుగా వెళ్తున్న ఓ బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన టాటా మ్యాజిక్ ఢీ కొట్టబోయింది. ప్రాణాలు కాపాడుకునేందుకు బైక్‌ను రోడ్డు కిందకు మళ్లించే క్రమంలో గుడి పక్కన ఉన్న బోర్డు కనిపించలేదు. వేగంగా వచ్చిన ఆ ద్విచక్ర వాహనం బోర్డుకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ బైక్ మీద ఉన్న వ్యక్తి రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. తుంటి ఎముక విరిపోయింది. క్షణాల్లో జరిగిపోయిన ఈ సంఘటన నుంచి క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన రమేష్ కనీసం మూడు నెలలు మంచానికే పరిమితం అని డాక్టర్లు చెప్పారు. అంతేగాక కదలక మెదలక ఇంటికి పరిమితం కావాలని సెలవిచ్చారు. ఇలా ఇల్లెందు – గుండాల రోడ్డులోనూ ఓ చోట ఆద మర్చితే అధోగతి పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల పట్టణంలోని గోవింగ్ సెంటర్ నుంచి చెరువు కట్ట వరకు నూతన రోడ్డు నిర్మాణం సెంట్రల్ లైటింగ్ చేపట్టారు. రోడ్డు వెడల్పు చేయటం వల్ల రోడ్డు పక్కనున్న ఓ చేతి పంపు రోడ్డు మీదకు వచ్చింది. చేసేదేమీ లేక అక్కడ రోడ్డును వదిలేశారు. రోడ్డును మలుపు తిప్పారు. నిత్యం గుండాల ఇల్లెందు రోడ్డులో రాకపోకలు రద్దీగా ఉంటాయి.

రాత్రుల్లో ఈ చేతిపంపు కనిపించకపోతే దాన్ని ఢీ కొట్టే ప్రమాదం ఉంది. ఇక ఇదే రోడ్డులో మరోవైపు మరోచోట పాఖాల రోడ్డులో ఎస్సీ– బీసీ హాస్టళ్ల మధ్య ఓ మర్రి చెట్టు కూలి రోడ్డు పక్కన పడిపోయింది. బీటీ రోడ్డుకు సమీపంలో ఉండటంతో ఆదమర్చి అతి వేగంగా ప్రయాణిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డు నిర్మాణం చేసే క్రమంలో ఈ కూలిపోయిన చెట్టును తొలగిస్తే బావుండేదని, కానీ చెట్టును తొలగించకుండా రోడ్డు నిర్మాణం చేశారని స్థానికులు వాపోతున్నారు. అక్కడి నుంచి తొలగించటమో లేదంటే కనీసం పక్కకు నెట్టడమో చేస్తే బావుండేదని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు పొంచి చోట్ల సంబంధిత అధికారులు శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


జేకే బస్టాప్ వద్ద రోడ్డు పక్కన ప్రమాదకరంగా సూచిక బోర్డు


గోవింద్ సెంటర్ సమీపంలో రోడ్డు వెడల్పులో తొలగించని చేతిపంపు

తక్షణం తొలగించాలి..



రోడ్డుపై ప్రమాదాలు ఉన్న చోట తక్షణమే వాటిని తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. తాజాగా నాలుగు రోజుల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తృటిలో ప్రాణాప్రాయం తప్పింది. ఆర్అండ్‌బీ, మున్సిపల్, పీఆర్ శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– గొగ్గెల రామస్వామి, ఇల్లెందు

చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో తాము చేపట్టిన రోడ్డులో తమ పరిధిలోని గుండాల రోడ్డులో రెండు చోట్ల వాహనదారులకు ఇబ్బంది కలిగేవిధంగా ఉంది. వాటిని గుర్తించాము. త్వరలో తొలగిస్తాము. ఒక చోట చేతిపంపు, మరోచోట రోడ్డు పక్కన పెద్ద చెట్టు పడిపోయి ఉంది. వాటిని తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

– జి. రాజు , పీఆర్ ఏఈ ఇల్లెందు

క్లుప్తంగా

ఆర్టీసీ సేవలపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న కార్గో సిబ్బంది

చుంచుపల్లి: కార్గో లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెంలో ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రతి షాప్‌కు వెళ్లి కార్గో సేవలపై వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. రామారావు మాట్లాడుతూ.. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ సేవలను వినియోగించుకోవాలని, అదేవిధంగా హైదరాబాదు తరహాలో హోమ్ డెలివరీ సదుపాయం కొత్తగూడెంలోనూ ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం డీఎం దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటిన త్రిష


నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష జిల్లా కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేసిందని గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోము అన్నారు. సోమవారం ప్రకాశం స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులతో జరిగిన అభినందన కార్యక్రమంలో గెర్షోము మాట్లాడారు. త్రిష భవిష్యత్‌లో క్రికెట్‌లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వినోదిని, అనూష, సూర్యనారాయణ, శంకర్, రాధ, అంజలి పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం


జ్ఞాపిక అందుకుంటున్న కళ్యాణ్, సుమిత్ర

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని బూడిదగడ్డకు చెందిన పాటల రచయిత, గాయకులు కళ్యాణ్, సుమిత్రలకు సౌత్ ఇండియన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు లభించింది. 250 పాటలు రచించి యూట్యూబ్‌లో విడుదల చేసినందుకు గాను ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తమకు సౌత్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించి, జ్ఞాపిక అందజేసినట్లు కళ్యాణ్, సుమిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేటీపీఎస్ క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రభాకర్‌రావు

పాల్వంచ: ఇటీవల కేటీపీఎస్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్ బాల్, హాకీ క్రీడల్లో 5, 6 దశల క్రీడాకారులు సత్తా చాటారు. టేబుల్ టెన్నిస్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించారు. వీరిని సోమవారం సీఈ ఎం.ప్రభాకర్ రావు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈ బి.మోక్షవీర్, కెప్టెన్‌లు కె.వాసు, జి.వెంకటేశ్వర్లు, ఎస్.మంగూలాల్, గేమ్స్ సెక్రటరీలు టి.వీరస్వామి, వైటీఎంకే.రాజు, వెల్ఫేర్ ఆఫీసర్ బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

డైరీలు ఆవిష్కరణ

పాల్వంచ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, వాల్, టేబుల్ క్యాలెండర్లను సోమవారం కేటీపీఎస్ 5, 6 దశల సీఈ మేక ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రటరీ కూరపాటి రమేష్, రీజినల్ ప్రెసిడెంట్ వరికూటి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పొడెం కృష్ణ, నవీన్, శ్రావణ్, కన్నయ్య, శ్రీను, సత్యం, ప్రసాద్, తంబాల వెంకటేశ్వర్లు, బాలరాజు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఫిజియో థెరపీ సేవలు అందించండి..

టేకులపల్లి: ఏజెన్సీలోని అన్నివర్గాల ప్రజలకు మెరుగైన ఫిజియో థెరపీ సేవలు అందించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శంకర్ ఫిజియోథెరపీ క్లీనిక్‌ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్లీనిక్ నిర్వాహకుడు జి.శంకర్, కోరం సురేందర్, డాక్టర్ జె.వెంకన్న, భూక్యా సర్దార్, చందర్‌సింగ్, శ్యామ్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయండి..

జూలూరుపాడు: రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జూలూరుపాడులో సంఘాల నాయకుల సమావేశం జరిగింది. మాట్లాడుతూ... నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలకు నిరసగా ఈనెల 5న జాతీయ సంఘాల జేఏసీ పిలుపునిచ్చిందన్నారు. రైతు, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో జరగనున్న నిరసన కార్యక్రమానికి రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, ఉపాధి, సంఘటిత, అసంఘటిత కార్మికులు, పేదలకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమని, ఇది ప్రజా వ్యతిరేక విధానమన్నారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, బానోత్ ధర్మా, రెడ్డిబోయిన గోవిందు, రాయల సిద్ధు, గడిదేశి కనకరత్నం, లక్ష్మయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

స్వయం ఉపాధిలో ముందుండాలి


శిక్షణ పొందిన మహిళలతో రమ

ఇల్లెందు: మహిళలు స్వయం ఉపాధిలో ముందుండాలని, స్వశక్తితో ఎదగాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు వి.రమ అన్నారు. సోమవారం ఇల్లెందు ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల ఉచిత ఉపాధి శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. ఇల్లెందులోని ఉచిత శిక్షణకు వివిధ రకాల ట్రేడ్‌లకు సుమారు 175 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారికి ఉచిత శిక్షణ ఇచ్చి స్వశక్తితో తన కాళ్ల మీద తాము నిలబడేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణ పొందిన మహిళలు తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా కార్యదర్శి సులక్షణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉద్యమకారుల సమావేశం రామవరం ఎస్సీబీ నగర్‌లోని పోశమ్మ దేవాలయ ఆవరణలో హరిగోపాల్ అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఆందోళన ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందని, వీరిని ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పి మరిచారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిచాలని కోరారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా సీహెచ్ గోపిచంద్, వైస్ ప్రసిడెంట్లుగా ఆర్.దేవయ్య, ఈ.శంకర్, జాయింట్ సెక్రటరీలుగా యాదగిరి, జానీపాషా, ట్రెజరర్ జయరాజు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.రామచందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కనకరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మాతంగి లింగయ్య, ఏ.లక్ష్మీనారాయణ, టి.రమేష్, ఎం.అంజనేయులు, ఎం.రాజయ్య, సయ్యద్ జావేద్, చీఫ్ అడ్వయిజర్‌గా కే.సందీప్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరిగోపాల్

రిటైర్డ్ బెనిఫిట్స్ అందజేయాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్ చెల్లింపులో జాప్యం జరుగుతోందని, వీలైనంత త్వరగా అందజేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, డీజీఎం శివకేశవులు, పీఏ మూర్తి, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎస్‌కే గౌస్, భూటిక రాజేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, జీదుల రాజేశ్వరరావు, పోచం శ్రీనివాస్, మల్లారం కొమరయ్య, నాగార్జున, విప్లవరెడ్డి,చిలక రాజయ్య, సత్తార్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ మంత్రిని నియమించండి..

కొత్తగూడెంఅర్బన్: క్యాబినెట్‌లో ముస్లిం వర్గానికి చెందిన వారిని మైనారిటీ మంత్రిగా వెంటనే నియమించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మైనారిటీ మంత్రి లేని కారణంగా పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. తాజాగా విడుదలైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా రాష్ట్రంలో 44,54,012 మంది ముస్లిం మైనారిటీలుండగా రాష్ట్రంలో మైనారిటీ మంత్రి లేకపోవడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ గురుకులాలు చాలా వరకు ఇరుకు గదులు, కిరాయి భవనాలు అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని, నేటి వరకు రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేయలేదని, నిరుద్యోగులకు మైనార్టీ స్టడీ సర్కిల్ కూడా లేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములను సర్వే చేయించడంతో పాటు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి మైనారిటీ మంత్రిని నియమించాలని కోరారు. తద్వారా మైనార్టీల సమస్యలు పరిష్కారం అవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేడు రాజకీయ పక్షాలతో సమావేశం

ఇల్లెందురూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం మండలంలోని రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఓటరు జాబితాలో సవరణలపై మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రజాదరణ మరువలేనిది..

సింగరేణి(కొత్తగూడెం): ప్రజాదరణ మరువలేనిదని, మూడు పర్యాయాలు 10వ వార్డులో సీపీఐ వార్డు ప్రజలు తనను గెలిపిస్తున్నారని, వారికి రుణపడి ఉంటానని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ అన్నారు. సోమవారం వార్డు ప్రజల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో బయాన ఈశ్వరయ్య, ముద్దం మార్తమ్మ, మేడి పల్లి కవిత, బెల్లం బేబి, సుకన్య, ఏకాంత, రాంబాయి, గాదం విజయ, పశు ల ఈశ్వరి, లింగంపల్లి కౌసల్య, నాగుల విజయ, రావిశెట్టి పద్మ, ఆసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి..

కొత్తగూడెంటౌన్: బీఎల్ఓ కులగణన సర్వే డబ్బులు త్వరగా చెల్లించాలని అంగన్‌వాడీ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోనెమణి అన్నారు. సోమవారం కొత్తగూడెంలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... కొత్తగూడెంలో దాదాపుగా 60 మంది అంగన్‌వాడీ టీచర్లు కుల గణనతో పాటు బీఎల్ఓ డ్యూటీలలో పాల్గొన్నామని, ఒక్కొక్కరికి దాదాపుగా రూ.10 వేలు రావాల్సి ఉన్నా నేటికీ అందలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రమీల, రమణ, కృష్ణవేణి, మంజుల, లక్ష్మి, భాగ్యరేఖ, శ్రీదేవి, ప్రమీల, సత్యవతి, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం ఎప్పుడు ప్రకటించినా స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికలకు సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలలో వార్డుల వారీగా, పరిషత్ ఎన్నికలకు ప్రాంతాల వారీగా పోలింగ్ బూత్‌లను సిద్ధం చేయాలని చెప్పారు. తక్షణం పోలింగ్ బూత్‌లను సందర్శించి సౌకర్యాలు, వసతులను తనిఖీ చేయాలన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన ఓటరు జాబితాను మరోసారి సరిచూసుకోవాలని చెప్పారు. బ్యాలెట్ పత్రాలను భద్రపర్చడం, కౌటింగ్ కోసం అనువైన కేంద్రాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కులగణన వివరాలు ప్రజల ముందుకు రావడం, ప్రభుత్వం సైతం చర్చిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఏరియా జీఎంతో స్ట్రక్చరల్ సమావేశం


మాట్లాడుతున్న గుర్తింపు సంఘం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గుర్తింపు సంఘం నాయకులు ఏరియా జీఎం శాలేంరాజుతో సోమవారం ఏరియా లెవల్ స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. పీవీకే – 5 షాఫ్ట్ గనిలో 2 కొత్త ఎల్‌హెచ్‌డీ యంత్రాలు, మహిళా ఉద్యోగులకు వెయిటింగ్ హాల్, డిపెండెంట్ ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఇంకా పలు సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. స్పందించిన జీఎం పరిశీలించి త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా బ్రాంచి కార్యదర్శి మల్లికార్జున్‌రావు, సహాయ బ్రాంచి కార్యదర్శి జి.వీరస్వామి, గట్టయ్య, కత్తెర రాములు, ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, డీజీఎం శివకేశవరావు, ఏజెంట్ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే అట్రాసిటీ కేసులు

టేకులపల్లి: ప్రజా సమస్యలపై ప్రశ్నించిన, నిలదీసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దారుణమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. సోమవారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎవరిపై కేసులు పెడదామా అని కుట్రలు చేస్తున్నారే తప్ప ఇచ్చిన హామీలపై ఆలోచనే లేదని విమర్శించారు. గ్రామసభల్లో అధికారులను, ప్రజాప్రతినిధులను ఇచ్చిన హామీలపై నిలదీసినందుకు సంబంధం లేని వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీలో గిరిజనులకు, గిరిజనేతరులకు వేర్వేరుగా గ్రామసభలు ఉంటాయా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తో పరోక్షంగా, ప్రత్యక్షంగా సంబంధం ఉన్న వారిపై, నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా నాన్ బెయిలబుల్ కేసులు పెడుతున్నారని, బీఆర్ఎస్ హయాంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఏమీ లేవని, అందరినీ సమానంగా చూశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బొమ్మెర వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, ఆల్యా నాయక్, బర్మావత్ శివ, భూక్యా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

కార్మికుల వేతనాలు పెంచాలి


హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులు

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి అన్నారు. సోమవారం జూలూరుపాడులో యూనియన్ మండల మహాసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలసరి వేతనం రూ.10 వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల కార్మికులకు నెలకు రూ.3,000 చొప్పున ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, అదేవిధంగా యూనిఫాం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంట షెడ్లు నిర్మించి, గ్యాస్ ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. వంట బిల్లులు కులాల వారీగా వేర్వేరుగా చెల్లించడాన్ని ఆమె తప్పు పట్టారు. కార్యక్రమంలో గడల మంగమ్మ, ముదిగొండ లక్ష్మి, కొరివి ఇందిర, సత్యావతి, మంగమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌కు తరలిరండి..

సుజాతనగర్: ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం నాయకులు వేల్పుల భాస్కర్ అధ్యక్షతన సుజాతనగర్‌లో ఆయా రాజకీయ పార్టీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు వర్గీకరణకు మద్దతు ప్రకటించారు. నాయకులు మాట్లాడుతూ... రిజర్వేషన్ ఫలాలను ఒక సామాజిక వర్గం వారే పొందటం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎం.ఆనందరావు, నాగా సీతారాములు, మండె హనుమంతరావు, బత్తుల వీరయ్య, వీర్ల రమేష్, చింతలపూడి జగన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారాములు

తెలంగాణకు తీరని అన్యాయం


పాల్వంచ: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు


కొత్తగూడెంఅర్బన్: బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ, సీపీఎం ఆధ్వర్యంలో కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో సోమవారం వేర్వేరుగా నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణకు తీరని అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా తెలంగాణలోని ఆ పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు, కార్మికులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన హామీలకు నిధులు కేటాయించలేదని, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు నిధులు పెంచక పోవడం సరికాదన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, కాంగ్రెస్ నేతలు



ఇల్లెందు: ఖాళీ ప్లేట్లతో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


టేకులపల్లి: మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు